క్లుప్తంగా

లైసెన్స్ లేకుంటే చర్యలు

అశ్వాపురం: లైసెన్స్ లేకుండా గ్రామాల్లో రైతుల వద్ద పత్తి కొనుగోలు చేస్తే మార్కెట్ కమిటీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి నిర్మల అన్నారు. మండల పరిధిలోని గొందిగూడెం గ్రామ సమీపంలో పత్తి లోడ్‌తో వెళ్తున్న ట్రాలీ వాహనాన్ని సోమవారం నిర్మల ఆపి అనుమతి పత్రాలు చూపమని అడిగారు. డ్రైవర్ వద్ద ఎటువంటి పత్రాలు లేకపోవడంతో మార్కెట్ ఫీజు రూ.1900, ఫైన్ రూ.1900 విధించారు.

ఆరోగ్యలక్ష్మి పథకాన్ని సక్రమంగా నిర్వహించండి

చంద్రుగొండ: ఆరోగ్యలక్ష్మి పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మలాజ్యోతి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. మండలంలోని అన్నారంతండాలో పోకలగూడెం సెక్టార్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. గర్భిణులు, చిన్నపిల్లల తల్లుల ఆరోగ్యవిషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్ శకుంతల, టీచర్లు సరోజ, ఉమారాణి, గోపమ్మ, విజయ, నీలిమా, లక్ష్మి పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి..

అశ్వాపురం: కరోనా మహమ్మారి వ్యాప్తి, గోదావరి వరదల సమయంలో మండల ప్రజలకు తహసీల్దార్ సురేష్‌కుమార్ చేసిన సేవలు మరువలేనివని అశ్వాపురం సర్పంచ్ బాణోత్ శారద అన్నారు. బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ సురేష్‌కుమార్‌ను సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సర్పంచ్ బాణోత్ శారద, సదర్‌లాల్ దంపతులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కరోనా వ్యాప్తి సమయంలో ప్రాణాలు పణంగా పెట్టి తహసీల్దార్ సురేష్ చేసిన సేవలు అభినందనీయమన్నారు. గోదావరి వరదల సమయంలో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేశారన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

అశ్వాపురం: ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు మండలంలోని గిరిజన క్రీడాకారులకు సోమవారం వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. రేగా విష్ణు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పలు గ్రామాల గిరిజన యువతకు, వాలీబాల్ క్రీడాకారులకు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, సీనియర్ నాయకుడు సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, చిలకా వెంకటరామయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

రగ్గులు పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని గొత్తికోయ గిరిజన గ్రామాలైన మానుగట్ట, ముల్కానాపల్లి గుంపులోని ఆదివాసీలకు రూరల్ హోప్ ఫౌండేషన్, ఇండిజినేయస్ డవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రగ్గులను పంపిణీ చేశారు. రెండు గ్రామాల్లోని 58 కుటుంబాలకు ప్రతి ఇంటికీ 4 బ్లాంకెట్లు, దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు కొరస రామకృష్ణ మాట్లాడారు. అనంతరం గ్రామంలోని ప్రజల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్న పాల్వంచ దగ్గర్లో ఉన్న గిరిజన చారిటీ హాస్పటల్‌కి వస్తే ఉచితంగా వైద్య సదుపాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మడకం భారతి, ఉమేష్, నాగ మల్లేష్, చంటి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు ప్రారంభం

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల పంచాయతీ పరిధిలో ఉన్న గోవిందాపురం గ్రామం నుంచి బంకచింతలపాడు గ్రామం వరకు సుమారు ఐదు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులకు పర్ణశాల సర్పంచ్ తెల్లం వరలక్ష్మి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. గోవిందాపురం నుంచి బక్కచింతలపాడు గ్రామం వరకు సెంట్రల్ ఫండ్ నిధులతో ఆర్ అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో ఈ రోడ్డు పనులను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ తెల్లం వరలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తెల్లం భీమరాజు, కాంగ్రెస్ నాయకులు తెల్లం హరికృష్ణ, కాంట్రాక్టర్ వెంకటరమణ, తెల్లం ఆదయ్య, నరసయ్య, కంగాల భద్రయ్య, మరియు గ్రామ పెద్దలు యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

మణుగూరురూరల్: విద్యుత్ ఉద్యోగుల పీఆర్‌సీ–2022 సాధన కోసం తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని టీఎస్‌పీఈ జేఏసీ కన్వీనర్ శ్రీనివాస రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం మణుగూరులో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 1న నల్లబ్యాడ్జీలు ధరించి, 2న హైదరాబాద్‌లోని విద్యుత్ సౌదా ఎదుట ధర్నాలో చేపట్టనున్నట్లు తెలిపారు. సమస్యలపై టీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్నకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో జేఏసీ చైర్మన్ ప్రసాద్, టీఎస్‌పీఈఏ అధ్యక్షుడు రవిప్రసాద్, ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు రాజబాబు, నరేష్, కెమిస్ట్రీ అసోసియేషన్ నాయకులు దయాకర్, కార్మిక సంఘం 1104 నాయకులు అనిల్ పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

- అర్హులైన వారికి పథకాలు వర్తింపజేయాలి
- గిరిజన దర్బార్‌లో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్


గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, పక్కన డీడీ రమాదేవి

భద్రాచలం: గిరిజనులు సమర్పించే సమస్యల దరఖాస్తులను అర్హత మేరకు తక్షణమే పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశపు మందిరంలో జరిగిన గిరిజన దర్బారులో వివిధ ప్రాంతాల వద్ద నుంచి వచ్చిన గిరిజనుల దరఖాస్తులను స్వీకరించారు. వాటిని ఆయా యూనిట్ అధికారులకు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గిరిజనుల చెంతకు చేర్చటంలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. అర్హతల మేరకు దరఖాస్తులను పరిశీలించి పథకాలకు వారిని ఎంపిక చేయాలని సూచించారు. అదేవిధంగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో సిలబస్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా తొలుత అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి అమర వీరుల త్యాగాలను స్మరించారు. కార్యక్రమాల్లో డీడీ రమాదేవి, ఏఓ భీమ్, అగ్రికల్చర్ ఏడీ, భాస్కర్, విద్యుత్ శాఖ అధికారి మునీర్ పాషా, ఐటీడీఏ మేనేజర్ ఆదినారాయణ, వివిధ యూనిట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతర పోస్టర్లు ఆవిష్కరణ

చిరుమల్ల శ్రీ సమ్మక్క సారక్క జాతర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 4 వరకు జాతర జరుగుతుందని, 2వ తేదీన సమ్మక్క దేవత, పగిడిద రాజు వివాహం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఐటీడీఏ అధికారులతో పాటుగా ఉత్సవ కమిటీ సభ్యులు చందా లింగయ్య, వాసం రామకృష్ణ, గుగ్గుల రామకృష్ణ, కొమరం శ్రీను, వాసం అంజిబాబు, వజ్ర నగేష్, శ్రీను పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం

అన్నపురెడ్డిపల్లి: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక అన్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని ఎర్రగుంట జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాధిపై అవగాన కల్పించారు. అనంతరం విద్యార్థులతో మానవహారం నిర్వహించి, కుష్ఠు వ్యాధి రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. చర్మం పైన స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని, కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చిక్సిత తీసుకోవడం వల్ల నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మోహనరావు, హెచ్‌ఎస్ నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్పర్శ లెప్రసీ అవగాహన ఉద్యమాన్ని పంచాయతీ సర్పంచ్ ఏనిక ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధీజీ వర్ధంతి రోజున ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో 15రోజుల పాటు కొనసాగనుందని తెలిపారు. లెప్రసీ సర్వే నిర్వహించి ముదురు రాగి రంగు మచ్చలుండి స్పర్శ లేని వారిని పీహెచ్‌సీకి తరలించాలని ఆశాకార్యకర్తలకు సూచించారు. అనంతరం స్పర్శ లెప్రసీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, సబ్‌యూనిట్ ఆఫీసర్ లింగ్యానాయక్, సూపర్‌వైజర్ దయామని, రాంప్రసాద్, ఉమేష్, చంద్రకుమారి, లక్ష్మి, ఏపీ లక్ష్మి, వీరమాతా, పంచాయతీ కార్యదర్శి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


మణుగూరురూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్, పీహెచ్‌సీ సిబ్బంది

స్వప్రయోజనాల కోసమే ఆరోపణలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

చంద్రుగొండ: స్వప్రయోజనాల కోసమే ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుపై పార్టీలోని కొంత మంది అసత్య ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు అన్నారు. ఆ పార్టీలోని ఓ వర్గం ఎమ్మెల్యేపై అవినీతి ఆరోపణలు చేసిన నేపథ్యంలో సోమవారం సమావేశమైన మరోవర్గం నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆరోపణలను ఖండించారు. పార్టీ కార్యక్రమాల నేపథ్యంలో అనేకమార్లు ఆహ్వానించినా పాల్గొనని వారు, నేడు తమకు సమాచారం ఇవ్వడం లేదని చెప్పడం విడ్డూరమన్నారు. దార వెంకటేశ్వరరావుతోపాటు జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎస్డీ రసూల్, సొసైటీ వైస్‌చైర్మెన్ నల్లమోతు వెంకటనారాయణ, డైరెక్టర్ ఉన్నం నాగరాజు, పార్టీ మండల కార్యదర్శి ఉప్పతల ఏడుకొండలు మాట్లాడుతూ.. విభేదాలు ఉంటే కూర్చుని పరిష్కరించుకోవాలిగాని పార్టీ పరువును బజారుకీడ్చడం ఏంటని ప్రశ్నించారు. ఎంపీపీ పార్వతి తన కోటా రూ.30 లక్షల అభివృద్ధి నిధులను పర్సంటేజీలు తీసుకుని అమ్ముకున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో సర్పంచ్‌లు బాణోత్ రణ్యా, కుమారి, ఎంపీటీసీలు లంకా విజయలక్ష్మి, రాజీలతోపాటు గాదే శివప్రసాద్, మెడా మోహన్‌రావు, భూపతి శ్రీనివాసరావు, సీహెచ్ రామరాజు, సూరా వెంకటేశ్వర్లు, సత్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

మణుగూరురూరల్: మండలంలోని పగిడేరు గ్రామపంచాయతీ పరిధి గొల్లకొత్తూరులో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగుస్తున్న నేపథ్యంలో రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించుకోవాలని సూచించారు. ఈ ధాన్యం కొనుగోలు విషయంపై జిల్లా కలెక్టర్‌ను గడువు పొడిగించాల్సిందిగా కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఫారెస్ట్ రేంజర్

దమ్మపేట: మండల పరిధిలోని నల్లివారిగూడెం గ్రామానికి చెందిన కుంట లక్ష్మికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సోమవారం ఆయన నివాసం తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో అందజేశారు. దమ్మపేట మండల ఫారెస్ట్ రేంజర్ కరుణాకర్, నూతనంగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మండల పరిధిలోని అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సూరమ్మ, రాజలక్ష్మి, జ్యోతి, జయ, ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అన్నపురెడ్డిపల్లి: మండల నూతన ప్రెస్‌క్లబ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మండల కేంద్రంలోని శివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా కల్లోజి అచ్యయ్య, ప్రధాన కార్యదర్శి చందు, ఉపాధ్యక్షుడు ఈదుల సురేష్, కోశాధికారి రహీం పఠాన్, గౌరవ అధ్యక్షుడు మానికల సీతయ్య, గౌరవ సలహాదారుడుగా పర్సా నాగేశ్వరరావు, సభ్యులుగా చెన్నారావు, మాధవరావు, కిషోర్, ఉమా మహేశ్వరరావు, బాలయోగిలను ఎన్నుకున్నారు.

కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీకి చెందిన చింతిర్యాల చంద్రశేఖర్ అనే వ్యక్తి అదే కాలనీకి చెందిన వేముల వాసుపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడి తెలిపిన వివరాల ప్రకారం.. వేముల వాసు సోమవారం మద్యం సేవించి చంద్రశేఖర్ ఇంటికి వచ్చి అకారణంగా నోటికి వచ్చినట్లు దూషించారు. రాయితో దాడి చేయగా ఎడమ చేతికి, కాలికి, కంటికి దెబ్బలు తగిలాయి. అదే విధంగా కత్తితో పొడిచి చంపుతానని బెదిరించాడు అని చంద్రశేఖర్ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేశారు.

వ్యక్తికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో సోమవారం ఓ వ్యక్తికు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేటకు చెందిన పడాల రవికుమార్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై ఏపీలోని రాజమండ్రి నుంచి స్వగ్రామానికి వచ్చే క్రమంలో జంగారెడ్డిగూడెం రోడ్‌లో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దాంతో రవికుమార్‌కు తీవ్రమైన గాయాలు కాగా అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో పరిస్థితి విషమంగా ఉంది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

మాజీ సొసైటీ చైర్మన్ మృతి

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన మాజీ సొసైటీ చైర్మన్ తలకోల వెంకటేశ్వరరెడ్డి(83) సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతదేహాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత దంపతులు, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు బట్టా విజయ్‌గాంధీ, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు

అశ్వాపురం: మావోయిస్టులకు సహకరిస్తే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అశ్వాపురం సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండల పరిధిలోని గొందిగూడెం కొత్తూరు గ్రామ పంచాయతీలోని మారుమూల గ్రామమైన గుండ్లమడుగు గ్రామంలో సోమవారం 141 బెటాలియన్ ఎఫ్ కంపెనీ, జీ కంపెనీ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. గొందిగూడెం కొత్తూరు, గుండ్లమడుగు, ఎలకలగూడెం, గొందిగూడెం గ్రామాల గిరిజనులకు దోమతెరలు, సోలార్ లైట్లు, టీషర్టులు, చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సీఐ శ్రీనివాసరావు మాట్లాడారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామన్నారు. మావోయిస్టులకు ఆశ్రయం ఇచ్చినా సహకరించినా చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పర్శిక సూరిబాబు, ఎంపీటీసీ కొమరం చిట్టెమ్మ, కమాండెంట్ ప్రశాంత్‌దార్, సెకండ్ కమాండర్ లతీఫ్‌కుమార్‌సాహో, కమల్‌వీర్‌యాదవ్, అసిస్టెంట్ కమాండర్ హేమంత్‌కుమార్ శర్మ, రాజ్‌కుమార్, అశ్వాపురం ఎస్సై నాగుల్‌మీరా, సీఆర్‌పీఎఫ్ ఇన్స్‌పెక్టర్లు సత్యనారాయణ, సాగర్‌మల్లు, సిబ్బంది పాల్గొన్నారు.


గిరిజనులకు సామగ్రి పంపిణీ చేస్తున్న సీఐ శ్రీనివాస్, బెటాలియన్ అధికారులు

మహాశక్తిగా మాదిగల ఐక్య వేదిక

మణుగూరుటౌన్: మహాశక్తిగా మాదిగల ఐక్య వేదిక ఏర్పడుతుందని మాదిగ ఐక్యవేదిక పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు రావులపల్లి రాంమూర్తి అన్నారు. సోమవారం మణుగూరు మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మాదిగ ఐక్యవేదిక కార్యాలయాన్ని ప్రారంభించి ప్రసంగించారు.


తొలుత మణుగూరు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేశారు. ఫిబ్రవరిలో మాదిగల ఆత్మీయ సమ్మేళనం చేపట్టనున్నట్లు, సుమారు 10వేల మందితో సురక్షాబస్టాండ్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మణుగూరు మాదిగ ఉద్యోగుల సంఘం నేత కుర్రి రాజేశ్వరరావు, జర్నలిస్టు మాచర్ల శ్రీనివాస్, వేదిక ప్రధాన కార్యదర్శి గద్దల నాగేశ్వరరావు, ఉపాధ్యాక్షుడు ఇసంపల్లి కృష్ణ, ట్రెజరర్ నల్లగట్ల రఘు, మిడియా ఇంచార్జి సిద్దెల తిరుమలరావు, విక్రమ్, నరేష్, రమేష్, నర్సింహారావు, శ్రీను, రాజబాబు, సాంబ, అశోక్, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, సురేష్, ప్రసాద్, నైనారపు నాగేశ్వరరావు, కలగూర శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.


గాంధీజీకి ఘన నివాళి

జాతీపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న గాంధీ విగ్రహాలు, చిత్రపటాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యాలయాలు, విద్యా సంస్థల్లో కార్యక్రమాలను చేపట్టారు. సత్యం, అహింస ఆయన నమ్మిన సిద్ధాంత మూలాలు అని, సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం గాంధీజీ ఉపయోగించిన ఆయుధాలు అని ఈ సందర్భంగా పలువురు వివరించారు.

– సాక్షినెట్‌వర్క్


అశ్వారావుపేటరూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ


బూర్గంపాడు: సారపాకలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు


చంద్రుగొండ : గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న శేషగిరిరావు


భద్రాచలంఅర్బన్: గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న టీఎన్‌జీవో నాయకులు


ములకలపల్లిలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం బాధ్యులు

యాత్ర ముగింపుపై సంబురాలు

దుమ్ముగూడెం: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ కన్యాకుమారి టు కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడో యాత్ర శ్రీనగర్‌లో సోమవారంతో ముగియడంపై స్థానిక కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. లక్ష్మీనగరం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మండల అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీనగరం గ్రామంలోని కిడ్స్ క్యాప్టివేషన్ ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థులకు చాక్లెట్లు బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లంక శివకుమార్ ,సోడి చలపతి, జిల్లా సోషల్ మీడియా చైర్మన్ కనుబుద్ది దేవా, కల్లూరి గోపి, లంక సంపత్, కొంపెల్లి మహేష్, ప్రధానోపాధ్యాయుడు మద్ది శ్రీనివాస్ రెడ్డి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర దేశ రాజకీయాల్లో కీలక మలుపు కానుందని కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావు అన్నారు. రాహుల్‌గాంధీ జోడో యాత్ర ముగింపు సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య ఆదేశాల మేరకు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్ జాతీయజెండాను ఎగురవేశారు. తొలుత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: జాతిపిత దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మాగాంధీ వర్ధంతి రోజున అహింసకు గుర్తుగా జోడోయాత్ర విజయవంతం కావడం దేశానికి శుభపరిణామమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అన్నారు. గాంధీ వర్ధంతి, భారత్ జోడో పాదయాత్ర ముగింపు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, ఎంపీటీసీ బేతం రామకృష్ణ, సర్పంచ్ బట్టా సత్యనారాయణ, నాయకులు బచ్చు వెంకటరమణ, తూము పెదరాఘవులు, ఉపేందర్, పాములు, చెన్నయ్య, రాము, మోసిన్, ఐలయ్య, ఫకీరయ్య, వీరయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఏఎస్పీ రోహిత్‌రాజ్‌కు వీడ్కోలు సన్మానం


రోహిత్‌రాజ్ దంపతులను సత్కరిస్తున్న పోలీస్ అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏఎస్పీగా విధులు నిర్వర్తించి హైదరాబాద్ గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా బదిలీపై వెళ్తున్న బి.రోహిత్‌రాజ్‌ను డివిజన్ పోలీసుల ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. పట్టణంలోని రెడ్డి భవన్‌లో ఆదివారం రాత్రి ఏర్పాటుచేసిన ఈ సమావేశంలో రోహిత్‌రాజ్ మాట్లాడుతూ.. శాంతిభద్రతలు మెరుగ్గా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ మేరకు శాంతి భద్రతల పరిరక్షణ కోసం క్రమశిక్షణ, అంకిత భావంతో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి సన్నిధిలోలో దాదాపు ఏడాది పాటు పనిచేసే అవకాశం రావడం సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. అనంతరం రోహిత్‌రాజ్ దంపతులను భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం మండలాల పోలీసు అధికారులు, సిబ్బంది సన్మానించారు. సీఐలు నాగరాజు రెడ్డి, అశోక్, రమేష్‌తో పాటు ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కాకూడదు

మణుగూరుటౌన్: యువత చెడు వ్యసనాలకు బానిస కాకూడదని మణుగూరు ఏఎస్సై మోహన్ అన్నారు. సోమవారం మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్రగ్స్, మద్యం, గంజాయి వంటి వాటికి అలవాటు పడకుండా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వీరు, మురళీ, ఐటీఐ ట్రైనింగ్ అధికారి జి.రవి, ఏటీఓలు శ్రీనివాసరావు, జి. వి కృష్ణారావు, నర్సయ్య పాల్గొన్నారు.

మెనూ చార్జీలు పెంచాలి

భద్రాచలంఅర్బన్: పెరుగుతున్న ధరలకి అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, టీచర్లు స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి మాట్లాడుతూ.. గ్యాస్ సిలిండర్ కోసం ఒక్కో అంగన్‌వాడీ టీచర్ ప్రతిసారి రూ.350 అదనంగా ఖర్చు భరించాల్సి వస్తోందని, ఆ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం మార్చి ఒకటి రెండు మూడు తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నామని అన్నారు. యూనియన్ నాయకురాళ్లు అనురాధ, లలిత, సావిత్రి, తిరుపతమ్మ, జ్యోతి, విజయలక్ష్మి, విజయ, జ్యోతి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

సూచిక బోర్డులేవి..?



మండలంలోని రాళ్లగూడెం, ఆర్ కొత్తగూడెం గ్రామాల సమీపాల్లోని ప్రధాన రహదార్లపై రోడ్లు కృంగిన ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టిన ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు.. ఆ ప్రాంతాల్లో ప్రమాద సూచికలను ఏర్పాటు చేయలేదు. ఆయా ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ట్యాంకర్లు, జేసీబీలు, లారీలతో పాత బీటీ రోడ్డు, దాని కింద ఉన్న మెటల్‌ను తొలగిస్తుండడంతో ఆ ప్రాంతం గుంతలుగా ఏర్పడింది. రాళ్లు తేలి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ నేపథ్యంలో ఇక్కడ కనీసం ప్రమాద సూచికలు కూడా ఏర్పాటు చేయలేదు. ఇక్కడ జరుగుతున్న పనులు గురించి తెలియని వాహనదారులు వేగంగా వస్తే ప్రమాదాల బారిన పడే అవకాశాలున్నాయి. ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు స్పందించి తక్షణమే ఈ ప్రాంతాలలో ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

– చర్ల

ప్రశ్నించాల్సిన అధికారి: హరిలాల్, డీఈ, రోడ్లు, భవనాలశాఖ, భద్రాచలం
ఫోన్ నంబర్: 94408 18414